# శ్రీ రమణ జ్యోతి — Sri Ramana Jyothi

జూన్ 2019 — June 2019

ఈ సంచికలో ... — IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 59వ ప్రవచనం (2) | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | శ్రీ భగవాన్ సేవలో | జి. శ్రీహరి రావు | 10 |
| 3. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | మల్లాది ఫణిమాల | 18 |
| 4. | భగవాను, ప్రాణాయామం | డా. వి. రామదాస్ మూర్తి | 22 |
| 5. | **Moving Tales from Mahabharatha** | Dr.K.Subrahmanian | 30 |
| 6. | **Sri Ramana Chatvarimsat** | V. Krithivasan | 36 |
| 7. | **Lest We Forget** | Goteti Raja Rao | 40 |
| 8. | **Saints of Periapuranam Meyporul Nayanar** | | 46 |
| 9. | **Kaupinavanthah Khalu Bhagyavantah** | Suri Nagamma | 48 |
| 10. | **Sankalpam** | | 51 |


## Events in Sri Ramana Kendram in June

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 6th June - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyoti either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**




*(గత సంచిక తరువాయి)* తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

# శ్రీ మణి గారి భాషణ

## ఆశ్రమంలో చిరకాల భక్తులు

నాకు ప్రవచనాలు ఇవ్వడం కాని, మాట్లాడటం కాని అలవాటు లేదు. అయినా కొన్ని ఆలోచనలను మీతో పంచుకొంటాను. ముఖ్యంగా రమణాశ్రమ విషయాలు. ఆశ్రమంతో మాకు ఎంతో సన్నిహిత సంబంధమున్నది. ఆశ్రమం అధ్యక్షులు శ్రీ వెంకటరామన్ మధుమేహ వ్యాధితో బాధపడుతున్నప్పటికీ, ఎప్పటి వలె వారు ఎంతో చురుకుగా ఆశ్రమ వ్యవహారాల్లో పాల్గొంటున్నారు. చిరకాలం నుండి వుంటున్న భక్తులలో శ్రీరామ స్వామి పిళ్లై వృద్ధులు. వారూ బాగున్నారు. వారు నూరవ సంవత్సరం వయస్సులో అడుగుపెట్టబోతున్నారు. ఇటీవల వారికి జరిగిన శస్త్ర చికిత్స తర్వాత కోలుకొంటున్నారు. భక్తులు శ్రీ నారాయణ రాజుగారు, శ్రీ బలరామరెడ్డిగారు, కనకమ్మగారు ఈ మధ్యనే మండు వేసవి కాబట్టి మరో ప్రదేశానికి వెళ్లారు. వారు ఆశ్రమానికి ఏ రోజయినా తిరిగి రావచ్చును. శ్రీ బలరామరెడ్డిగారు బెంగళూరులోను, కనకమ్మగారు మద్రాసులోను వున్నారు. ద్వారకనాథ రెడ్డిగారు కూడా ఆరోగ్యంగా వున్నారు. శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారిని మీరందరూ కలిసే వుంటారు, వారూ బాగున్నారు. వారిని "ఆశ్రమం అల్లుడు" అని అంటారు.

కుంజుస్వామిగారి కంటే రామస్వామి పిళ్లై వయసులో పెద్దవారు. పిళ్లై కాలేజి చదువు మానివేశారు. డిగ్రి కూడా పూర్తి

చేయలేదు. కారణం గాంధీగారే కావచ్చు లేదా ఆధ్యాత్మిక తృష్ణ కావచ్చు. నాకు తెలియదు. ఆశ్రమంలో ఇద్దరు పాశ్చాత్య భక్తులున్నారు. ఒకరు ఆస్బార్న్, మరొకరు చాడ్విక్. ఆస్బార్న్ బ్రిటిషు వారు, మంచి విద్యావేత్త. చాడ్విక్ ఒక సైనికుడు. విశాలమయిన భుజాలతో పొడగరి, అందగాడు. అట్లాగే కుంజుస్వామి, రామస్వామి కూడా. కుంజుస్వామి మృదుస్వభావం గలవాడు. రామస్వామి సదా పని మీదే ధ్యాస కల్గినవారు. స్కందాశ్రమానికి వెళ్లే నడకదారిని, ఒకళ్లిద్దరి సహాయంతో రామస్వామిగారే వేశారు. ఆశ్రమ తోటపని అంతా వారే చేసేవారు. ఆ రోజుల్లో ప్రతి వస్తువుకు ఊళ్లోకి వెళ్లాలి. రామస్వామి చాలా నిదానంగా ఒక సైకిలుపై వూళ్లోకి వెళ్లేవారు. తిరిగి రాగానే, చిన్నస్వామి మరొక వస్తువు కావాలని చెప్పగానే వెంటనే సైకిలులో వెళ్లేవారు. అందుకే వారిని ఆశ్రమవాసులు "సైకిల్ స్వామి" అని పిలిచేవారు. ఇపుడు ఆశ్రమంలోనే వుంటున్నారు. దేవరాజ మొదలియార్ గారు కూడా ఆశ్రమంలోనే వుంటున్నారు. "డే బై డే విత్ భగవాన్" అనే పుస్తకం వ్రాశారు. తమ అనుభవాలను ఎప్పుడూ భగవాన్‌తో చెప్పుకొనేవారు. వారికి ఏదీ వినబడదు. వారితో సంభాషణ ఎంతో కష్టం. కాని వారు చెప్పింది వింటే చాలు. నా పెద్దన్నగారు సుందరం తమ ఉద్యోగ విరమణానంతరం ఆశ్రమ బాధ్యతలను స్వీకరించారు. వారు ఇప్పుడు ఆశ్రమానికి మేనేజరు. శ్రీ గణేశన్ బాగానే ఉన్నారు. ప్రస్తుతం "మౌంటెన్ పాత్" పనులలో నిమగ్నమై వున్నారు. ఆశ్రమం బాగా పనిచేస్తోంది. అంతా భగవాన్ యొక్క అనుగ్రహమే. గోశాల చక్కగా ఉంది. గోశాలను కొంచం పెద్దది చేశాము. ఒక్క ఆవుతో ప్రారంభమయిన ఈ గోశాలలో ప్రస్తుతము



93 పశువులున్నాయి. నెమళ్ల సంఖ్య కూడా పెరిగిందని చెప్ప డానికి చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే తమిళాడు పాఠశాల పుస్తకంలో కేవలం రెండు స్థలాలలోనే నెమళ్లు కనబడతాయని వుంది. ఒకటి రమణాశ్రమం రెండవది తమిళనాడులో మరొక ప్రదేశము, విరాళిమలై. విరాళిమలై తిరుచినాపల్లి మధురై రహదారిలో వుంది.

## ఆశ్రమ కట్టడాలు

ఇక ఇతర కట్టడాల విషయానికొస్తే, ధ్యానమందిరం చుట్టూ ఒక కంచె కట్టబడింది. ఇప్పుడున్న భక్తుల రద్దీ కారణంగాను, టవును నుండి వచ్చే ప్రజల సంఖ్య అధికమవడం చేతను, చెక్కలతో కంచెకట్టాము. ఇపుడు బాగానే వుంది. ధ్యానమందిరం దగ్గర నిశ్శబ్దం చోటు చేసుకొంది. నీటి ఎద్దడి ఆశ్రమంలో ఇపుడు లేదు. రోజంతా ఆశ్రమం పనులలో మునిగి వున్నాను. రెండు అనుభవాలను మీతో పంచుకొంటాను.

ఇది జరిగి అయిదు ఆరేళ్లయింది. పొంగల్ మర్నాడు మాట్టు పొంగల్ (కనుమ). గోశాలలో వున్న పశువులను ఆశ్రమవాసులుగా పరిగణించడం ఒక ఆచారమయింది. ఆశ్రమవాసులందరికీ, భగవాన్ అనుగ్రహం వలన, వంటకు నాణ్యమయిన పదార్థాలే వాడబడతాయి. ప్రొద్దుటూరు నుండి నెయ్యి, మరొకచోటు నుండి పప్పులు వచ్చేవి. గోశాలకు ముఖ్యమయిన వస్తువు గడ్డి. కొన్ని గడ్డి మోపులు లావుగా భారీగా వుండేవి. అందువలన గడ్డి పాములను సిద్ధం చేయటం అదొక పెద్ద పని. ఇది మామూలుగా జనవరి నెలలో జరుగుతుంది. ముఖ్యంగా కోతలు అయిన

తర్వాత ''పొన్ని'' అనే ప్రత్యేకమైన గడ్డి మంచిది. చాలా పొడవైన కాడలతో వుండేది. ఆ రోజు ఎంతో శ్రమపడి గడ్డి కొన్నాము. మూడు గడ్డివాములు చేశాము. వర్షాలు లేక కరవు కాలం అపుడు. కనుమ దినము పనివాళ్లందరూ సెలవు తీసుకొని వారివారి గ్రామాలకు వెళ్లేవారు.

**అనుకోని సంఘటనలు**

ఆనాడు ఉదయం 10.00-10.30 గంటల మధ్య అగ్ని అంటుకొంది. అది ఎలాగా అంటుకొన్నదో మాకు తెలియదు. గడ్డివాములో నిప్పు చాలా భయంకరమయినది. అది ఆర్పడం అత్యంత కష్టమయినపని కూడ. మూడు అగ్నిమాపక ఇంజన్లతో బాటు పోలూరు నుండి ఇంజన్లు రప్పించారు. అగ్నిమాపక దళము వారన్నారు గడ్డిని లాగాలి తర్వాత అగ్నిని ఆర్పాలి. దాదాపు 11 గంటల పాటు అగ్నితో పోరాడవలసి వచ్చింది. ఎంతో బాధాకర మయిన సంఘటన అది. ప్రతి కనుమదినము మాదిరి గోశాలలో ఉదయం పూజ చేస్తాము. ఆ విషాదకరమైన రోజున పనివాళ్లు ఎవ్వరూ లేరు. ఆశ్రమంలో అందరూ వచ్చి సహాయం చేశారు. మొత్తానికి మంటలను ఆర్పేశాము. కాని మానసికంగా క్రుంగి పోయాము. అందరూ అలసి పోయారు. తర్వాత రామస్వామి పిళ్లై వచ్చారు. పూనకం వచ్చినట్లు కనబడ్డారు. అప్పటికి హెర్నియా ఆపరేషన్ ఇంకా జరుగలేదు. చిందరవందరగా పడివున్న గడ్డి, పరిస్థితి గందరగోళంగా వున్న సమయంలో రామస్వామి పిళ్లై నా దగ్గరకు వచ్చి నాతో ''మణి, ఇది భగవాన్ అనుగ్రహం అనుకో. ఒక వారం ముందు ఇది జరిగివుంటే ఏమయ్యేదో! అపుడు



భగవాన్ జయంతి'' అని వెళ్లిపోయారు. ఆ మాట అన్న మరుక్షణమే మాలో క్రొత్త ఉత్సాహం పొంగింది. ఎందుకు కనుమ నాడు జరగాలి?

రెండు మూడు రోజులు తర్వాత, ఒక భక్తుడు రెండువేల ఐదు వందల డాలర్లు పంపాడు. అతని జాబులో కేవలం గోశాల గురించే వ్రాశాడు. మేము ఎంతో సంతోషపడ్డాం. విషయం అంతటితో ఆగలేదు. మేము పొన్ని రకం గడ్డి కొనాలి. తిరువణ్ణామలై ఇతర చుట్టు ప్రక్కల వూళ్లల్లో క్షామం నెలకొంది అప్పట్లో. కాని మాకు మేలు రకమైన ఆ పొన్నిగడ్డి మాత్రమే కావాలి. మీరు ఆశ్చర్యపోతారు, పది రోజులలో గడ్డి మాకు దొరికింది. చెంగం దాటి ఒక గ్రామంలో ఒకరు పొన్ని గడ్డి వామును పెట్టుకొన్నాడు. ఒకవేళ ఈ ప్రమాదం గురించి విన్నాడేమో మాకు తెలియదు. భగవాన్ అనుగ్రహం, కరుణ ఎప్పుడూ లభిస్తుంది మాకు. కాని ఆ నమ్మకం దృఢపడాలి. ఇట్టివి మాకెంతో అవసరం.

ఒక్కొక్కసారి చిన్న చిన్న విషయాలు కూడా ఇట్లాగే జరిగేవి. గోశాల పనివాళ్లు ఆవులు నీరు త్రాగడానికి మరొక సిమెంటు తొట్టి అవసరమన్నారు. వెంటనే మేము పని ప్రారంభించలేదు. అనేకమార్లు దాని గురించి ఆలోచించి, చర్చించి చేయాలన్నదే ఒక ఆచారం. కారణం ఆశ్రమం సొమ్మును ఖర్చు చేయాలా? వద్దా? అనే మేము ఆలోచించేవారము. చివరకు తొట్టి కట్టాలనే నిర్ణయించాము. అప్పట్లో దానికి అయిన ఖర్చు 650-750 రూపాయలు. అయినా ఆలోచించవలసి వచ్చింది. తొట్టితో పాటు నీటి గొట్టాలు కూడా ఏర్పాటు చేయాలి. ఒకనాడు గుజరాత్

నుండి ఒక పోస్టు కార్డు వచ్చింది. ఒక భక్తుడు వ్రాసినది అది. తాను కొన్నాళ్లకు ముందు ఆశ్రమం వచ్చానని, అక్కడ గోశాలను చూసిన తరువాత, ఆవులు నీళ్లు త్రాగటానికి ఒక తొట్టిగాని లేదా ఒక చిన్న తటాకం గాని కట్టడానికి తాను పెట్టుబడి పెడతానని, ఎంత ఖర్చు అవుతుందో తెలుపమని ఆ కార్డులో వ్రాశారు. అటుపై తొట్టి కట్టడంలో వాడిన పైపులుతో సహా ఇంత అయిందని నేను జవాబు వ్రాశాను. అతను పైకం పంపే వుంటాడు. మాకు దృఢమైన నమ్మకం ఏమంటే, ఒక పని సజావుగా జరగాలంటే ఆలోచించి దానిని పూర్తి చేయాలని. ఇలాగ ఆచరిస్తే భగవాన్ అనుగ్రహంతో అది నెరవేరుతుంది. చిన్నచిన్న పనులలో కూడా వారి కృపపై మాకు నమ్మకం దృఢపడేది. శ్రీ బలరామరెడ్డి గారు "చిన్న స్వామి ఈ ఆశ్రమాన్ని నడుపుతున్నది అని మీరు భావిస్తున్నారా? లేదు భగవాన్ మాత్రమే ఆశ్రమాన్ని నడుపుతున్నారు. చిన్నస్వామి ఒక పరికరము మాత్రమే" అన్నారు. ఇలాంటి ఋజువు, దృఢీకరణం మాకు నిత్యమూ కనిపిస్తూండేది.

**ఆశ్రమానికి భక్తుల తాకిడి**

హైదరాబాద్ భక్తులంటే మాకు ఒక ప్రత్యేకమయిన గౌరవ ముంది. బహుశా డా. కె.ఎస్.గారి ప్రభావమే అని భావిస్తున్నాము. ఆ భక్తులు దేనినీ అడగరు. వారిని ఆహ్వానించి, సదుపాయాలు కల్గించడం మాకు ఎంతో ఆనందంగా వుంటుంది. మరొక విషయ మేమంటే, మాకు వసతిగదులు కొద్దిగానే వున్నాయి. కాని భక్తుల రాక ఎక్కువ అవుతోంది. మరిన్ని గదులు కట్టాలా వద్దా? అన్న ప్రశ్న తలెత్తింది. ఎంతో ఆలోచించిన పిదప ఆ ఆలోచనను



విరమించుకొన్నాము.

జనం ఎక్కువ అయినకొద్దీ, ముఖ్యంగా ప్రత్యేక దినాలలో, ఆశ్రమ వాతావరణ ప్రశాంతత తగ్గిపోతుందనే బాధ మాకుంది. ఇప్పటికే సాధారణ వాతావరణం (Informal atmosphere) ధ్యానాదులకు అనుకూలంగా వుండదు. అలాంటిది రద్దీ ఎక్కువ అయితే ధ్యానాదులకు ఆటంకంగా ఉండవచ్చు అనే అభిప్రాయం ఉంది. కనుకనే భక్తులు మాకు ముందే వారి రాకను గురించి తెల్పితే మేము వారికి ఎప్పుడు రావాలో తెలుపగల్గుతాము. ఇప్పటి వరకు ఈ పద్ధతి బాగానే సాగుతోంది. భక్తులు కూడా ఎంతో సహకరిస్తున్నారు. ఈ పద్ధతిని ఇట్లాగే కొనసాగించాలని మీ అందరిని కోరుతున్నాను. నవంబరు నుండి ఫిబ్రవరి వరకు చలికాలం కాబట్టి ఎందరో పాశ్చాత్యులు వస్తారు. వారికి అవకాశమివ్వాలి. ఈ నాలుగు నెలల్లో కూడా మీరు రావచ్చు. మేము తప్పక సహాయం చేయగలం. కేంద్రం నుండి వచ్చేవారు డా. కె.ఎస్.గారి నుండి ఒక లేఖ తీసుకొని వస్తే బాగుంటుంది.

(సశేషం)

**శ్రీరమణ కేంద్రం**

2-2-1109/ఏ, బతుకమ్మకుంట, హైద్రాబాద్ - 500 013.

**శ్రీరమణజ్యోతి మాసపత్రిక చందాదారుల వివరాలు ధృవీకరణ చేయబడుతోంది. ఈ కారణంగా (సంవత్సర, జీవిత) చందాదారులు మీ పూర్తి అడ్రెస్ (పిన్‌కోడ్‌తో సహా) మరియు మీ (లాండ్‌లైన్/మొబైల్ ఫోన్) నంబర్లు శ్రీరమణ కేంద్రానికి తెలుపగలరని ప్రార్థన.**

# శ్రీ భగవాన్ సేవలో

*(గత సంచిక తరువాయి)* - శ్రీ జి. శ్రీహరిరావు

## శ్రీ నిరంజనానంద స్వామి (చిన్నస్వామి)

స్వామి నిరంజనానందుల వారు (పూర్వాశ్రమంలో నాగ సుందరం) 1885 జూన్ 8వ తారీఖున శ్రీ సుందరం అయ్యర్, అళగమ్మాళ్ దంపతులకు తిరుచ్చుళిలో జన్మించారు. ఇద్దరు అన్నలూ, ఒక చెల్లెలు ఆయన సహోదరులు. పెద్దన్న శ్రీ నాగస్వామి రెండవ అన్న వెంకటరామన్ ఈయన కంటే ఆరేళ్ళు పెద్ద. చెల్లెలు అలిమేలు. 1892లో వారి తండ్రిగారు పోయినప్పుడు నాగసుంద రానికి ఆరేళ్ళు. గొప్పదాతగా పేరొందిన సుందరం అయ్యర్ దాచి పెట్టినదేమీ లేదు. ఆయన గతించిన తరువాత, కుటుంబం చుట్టాల మీదే ఆధారపడవలసి వచ్చినది. తన ఇద్దరు మరుదులు సుబ్బయ్యర్, నెల్లియప్ప అయ్యర్‌లతో అళగమ్మ సంప్రదించిన తరువాత, నాగస్వామి వెంకటరామన్‌లు తమ పై చదువుల కోసం సుబ్బయ్యర్ గారితో మధురలో వుండేటట్లున్నూ; తనూ, నాగసుందరం, అలిమేలు నెల్లియప్ప అయ్యర్ గారితో మానా మదురైలో వుండేటట్లూ నిర్ణయం తీసుకున్నారు.

1896 తరువాత భగవాన్ శ్రీరమణ మహర్షిగా ప్రసిద్ధికెక్కిన వెంకటరామన్, మరణానుభవం తరువాత జీవితమే పూర్తిగా మారిపోగా అరుణాచలం వెళ్ళిపోయి అక్కడే వుండిపోయారు. 1898లో అళగమ్మ, నాగస్వామి తిరువణ్ణామలకు పోయి శ్రీ భగవాన్‌ను యింటికి తీసుకు పోవటానికి ప్రయత్నించారు కానీ అది సాధ్యం కాలేదు. కానీ శ్రీ భగవాన్ సన్నిధి వైరాగ్యం పెంచు కోవటానికి వారికెంతో ఉపయోగపడింది-ముఖ్యంగా తల్లిగారికి.



1902 ప్రాంతంలో, నాగసుందరం శ్రీ భగవాన్‌ను కలుసు కోవటానికి వచ్చారు. ఆ సమయంలో శ్రీ భగవాన్ సద్గురుస్వామి గుహ (రావిచెట్టు గుహ)లో మౌనం పాటిస్తూ వున్నారు. శ్రీ భగవాన్‌ను కౌగిలించుకుని భోరున ఏడ్చారు శ్రీ నాగసుందరం. శ్రీ భగవాన్ మాత్రం చిరునవ్వుతో వుండిపోయారు. అచ్చట కొద్ది సేపున్న తరువాత, శ్రీ భగవాన్ కొరకు భక్తులు తెచ్చిపెట్టిన కలకండ గుహలో వుండటం గమనించారు. అది తన సోదరుని 'సొత్తే' అనుకొని, ఇంటిదగ్గర బంధువులకు ప్రసాదంగా యివ్వటానికి బాగుంటుందని కొంత కలకండ ఆయన పొట్లం కట్టుకున్నారు. ఈ సంగతి, పరిచారకుడు శ్రీపళని స్వామి తెలియ పరచగా, శ్రీ భగవాన్ నాగసుందరానికి మొదటి ఉపదేశమిచ్చారు. భక్తులిచ్చిన కానుకలు ఏ ఒక్కరికీ చెందవనీ, ఇటువంటి విషయాల్లో చుట్టరికాల ప్రసక్తి రాదనీ ఉపదేశ సారాంశం. తన దగ్గరకు వచ్చిన వారందరూ ఆ ప్రసాదం పంచుకో నర్హులని శ్రీ భగవాన్ తెలియజేశారు. ఈ ఉపదేశం శ్రీ నాగసుందరం హృదయంలో నాటుకుంది. జీవితాంతం ఆయన దానిని మరిచిపోలేదు.

1904లో మానా మదురై తాలూకా ఆఫీసులో పనికి కుదురు కొని, కుటుంబ పోషణకై సంపాదన మొదలుపెట్టారు నాగ సుందరం. 1908లో నెల్లియప్ప అయ్యర్ భార్య సోదరి పెద్ద కూతురు మంగళంను ఆయన వివాహం చేసుకున్నారు. వారికిద్దరు పిల్లలు పుట్టారు కానీ, చిన్న వయస్సులో వారిద్దరూ గతించారు.

1914లో వారికి మళ్ళీ మగబిడ్డ కలిగాడు. కొడుకుకు శ్రీ భగవాన్ పేరు వెంకటరామన్ అని పెట్టుకున్నారు. బిడ్డకు మొదటి

క్షురకర్మ కోసం, నాగసుందరం, మంగళం, అళగమ్మ, నెల్లియప్ప అయ్యర్, జానకి తిరుపతి వెళ్ళారు. అది ఏప్రిల్ మాసం. తిరిగి వచ్చేటప్పుడు శ్రీ భగవాన్‌ను దర్శించడానికి వాళ్ళు తిరువణ్ణామలై లో ఆగారు. అళగమ్మ వయోభారంతో బాగా అలసి పోయారు. "నేనిక వెనక్కురాను ఇక్కడే వుండిపోతాను", అని చెప్పేశారామె.

తన కుటుంబంతో తిరువేంకాడుకు వెళ్ళి, నాగసుందరం తన ఉద్యోగం కొనసాగించారు. కొద్దికాలం తరువాత, ఆయన భార్య మరణించింది. వేంకటరామన్ పుట్టినప్పటినుండీ ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. అబ్బాయిని చూసుకునే బాధ్యత నాగసుందరంపై పడింది. అది ఆయనకు సాధ్యం కాలేదు. మీదు మిక్కిలి, అప్పుల భారం ఎక్కువైపోయింది.

1916లో, తిరువణ్ణామల నివాసియైన శ్రీ నారాయణరెడ్డి అనే ఆయన, తిరువెంకాడుకు వచ్చి, అబ్బాయిని తిరువణ్ణామల తీసుకురమ్మని తల్లిగారు చెప్పారని నాగసుందరానికి తెలియ జేసారు. అది శ్రీ అరుణాచలేశ్వరుని ఆదేశంగా భావించి, కొడుకును నెల్లియప్పైయ్యర్ కుటుంబానికి అప్పచెప్పి, నాగసుందరం తిరువెంకాడు వదిలి పెట్టారు. 1917లో వేంకట రామన్‌ను, నాగసుందరం బావగారు పిచ్చు అయ్యర్ దత్తత తీసుకున్నారు. పిచ్చు అయ్యర్, అలమేలు దంపతులు వేంకట రామన్‌ను తమ యింటికి తీసుకు వెళ్ళారు.

శ్రీ భగవాన్‌కు శరణు పొందుదామని, నిశ్చయించుకొని ఆగష్టు 1917లో తిరువణ్ణామలై బయలుదేరిన నాగసుందరానికి అప్పుడు ముప్పై రెండేళ్ళు. అప్పటినుండి, ఆశ్రమం పనులకోసం తప్పితే, ఆయన తిరువణ్ణామలై వదలి వెళ్ళలేదు. నాగసుందరం



జీవితంలో అనేక మార్పులొచ్చాయి. ఉదాహరణకు, తిరువెంకాడు లో వున్నపుడు ఆయన అపుడపుడూ స్పృహ తప్పి పడిపోయేవారు. తిరువణ్ణామలై వచ్చిన తర్వాత అలా ఎపుడూ జరగలేదు. చిన్నపుడు నాగసుందరాన్ని 'పిచ్చై' అని పిలిచేవారు. 'పిచ్చై' అంటే భిక్ష అని అర్థం. నాగసుందరం శ్రీ భగవాన్ వద్దకు వచ్చినపుడు, "పిచ్చైను ఇక నువ్వే చూసుకోవాలి" అని భగవాన్‌తో అళఘమ్మ అన్నారు. తన నివాసానికీ, భోజనానికీ ఊళ్ళో ఒక ఇంట్లో ఏర్పాటు చేసుకొని, ప్రతిరోజూ శ్రీభగవాన్ దర్శనానికి స్కందాశ్రమం వెళ్ళేవారు.

1918లో, నాగసుందరం ప్రపంచ జీవితాన్ని త్యజించి, సన్న్యాసాశ్రమం స్వీకరించాలనే నిర్ణయం తీసుకొన్నారు. దీక్ష తీసుకొని, కాషాయ వస్త్రాలు శ్రీ భగవాన్ ముందు వుంచి, వాటిని ధరించారు. 'నిరంజనానంద' అనే నామం స్వీకరించారు. 'నిరంజన' అంటే పరిశుద్ధుడు, నిందారహితుడు, మచ్చలేనివాడు, గుణాతీతుడు అని అర్థం. 'ఆనంద' అంటే దివ్యానందం. తన తల్లితో సహా ఆయన కూడా శ్రీభగవాన్‌కు చెందిన సాధువుల సమాజంలో చేరిపోయారు. 'అహంకారాన్ని నిర్జించటానికి భిక్షాటన అన్నిటినీ మించిన మార్గం' అని శ్రీ భగవాన్ నొక్కి చెప్పుట వలన, సాధువులు అందరూ ప్రతిరోజూ ఊళ్ళోకి భిక్షాటనకు వెళ్ళేవారు. నిరంజనానందస్వామి బహు సౌమ్యులు, వినయశీలి, భక్తి పరాయణులు. శ్రీ భగవాన్ తమ్ముడను అనే గర్వం ఎపుడూ చూపించేవారు కాదు. శ్రీ భగవాన్ భక్తులు ఆయనను 'చిన్నస్వామి' అని పిలవడం ఆరంభించారు. నిరంజనానందస్వామికి శ్రీ భగవాన్ సేవ, ఆయన భక్తుల సేవ జీవిత పరమావధి అయిపోయింది.

తన తల్లితో శ్రీ భగవాన్ విరూపాక్ష గుహలో వుండేవారు. కానీ, అక్కడ నీటి సదుపాయం సంతృప్తికరంగా లేకపోవుట వలన, స్కందాశ్రమ నిర్మాణం జరిగింది. అక్కడ నిరంతర ప్రవాహంతో మూడు నీటి బుగ్గలు వుండేవి. శ్రీ భగవాన్ 1917లో స్కందాశ్ర మానికి మారిపోయారు. కొంతమంది భక్తుల సహకారంతో, అమ్మ అళఘమ్మ అక్కడ వంట ప్రారంభించారు. అపుడు ఆమె వెలిగించిన మంట ఇప్పటిదాకా శ్రీరమణాశ్రమంలో కొనసాగుతూ, దినదిన ప్రవర్ధమానమవుతున్న భక్త సమూహాలకు భోజనం సమ కూరుస్తోంది. స్కందాశ్రమంలో వున్న సాధువులందరి అవసరాలను శ్రీ గంభీరం శేషయ్యర్‌గారు, శ్రీవాసుదేవ శాస్త్రిగారు చూసుకొనే వారు.

1922లో అమ్మ అళఘమ్మ తీవ్రమైన అస్వస్థతకు గురి అయ్యారు. ఆమెకు విరోచనాలు పట్టుకొని వదలలేదు. శ్రీ భగవాన్, శ్రీ చిన్నస్వామి ఆమెకు రాత్రింబవళ్ళు సేవ చేసారు. ఒకరోజు ఆమె తన చిన్న కొడుకు చెయ్యి శ్రీభగవాన్ చేతిలో పెట్టి "పిచ్చికు మంచి ఏమిటో, చెడు ఏమిటో తెలియదు. అతనిని నీవే చూసుకోవాలి" అని కోరారు. ఆ తర్వాత బహు కొద్దికాలం లోనే, శ్రీభగవాన్ అనుగ్రహంతో ఆమె 1922 మే 19వ తారీఖున మహానిర్వాణం చెందారు. ఆమె దేహాన్ని స్కందాశ్రమం నుండి తీసుకువెళ్ళి పాలితీర్థం వద్ద సమాధి చేశారు. సమాధిస్థలం వద్ద లింగప్రతిష్ఠ చేసి, అక్కడ నీడకోసం ఒక పాక వేసారు. ఆ లింగానికి పూజ చేయటానికి, శ్రీనిరంజనానందస్వామి రోజూ ఉదయం, సాయంత్రం వెళ్ళేవారు. తర్వాత కొంతకాలానికి రాత్రుళ్ళు అక్కడే వుండిపోయేవారు.



1922 డిసెంబరులో, శ్రీ భగవాన్ తన అనుచరులతో సమాధి స్థలం వద్దకు నివసించడానికి వచ్చారు. ఆ విధంగా శ్రీరమణా శ్రమ ప్రారంభం జరిగింది. మొదట్లో, శ్రీదండపాణిస్వామి, ఆయన కుమారుడు ఆశ్రమ వ్యవహారాలు చూసేవారు. కానీ, దండపాణి స్వామికీ, చిన్నస్వామికీ కలిగిన తీవ్ర భేదాభిప్రాయాల వలన దండపాణిస్వామి ఆశ్రమం వదిలి వెళ్ళిపోయారు.

1924 నుండి 1930 వరకు ఆశ్రమ నిర్వహణ శ్రీవాసుదేవ శాస్త్రిగారు, శ్రీగోపాలరావుగారు చేశారు. శ్రీ శాస్త్రిగారు సంస్కృత పండితులు. గోపాలరావుగారికి ఊళ్ళో ఖాదీ బట్టల దుకాణం వుండేది. 1931 అక్టోబరులో శ్రీ చిన్నస్వామి ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా స్వీకరించారు. మొదట కార్యదర్శిగాను, తర్వాత సర్వాధికారిగాను పదవులు నిర్వహించారు. శ్రీభగవాన్ తరపున ఆశ్రమ కార్యక్రమాలు నిర్వహించే అధికారం శ్రీచిన్నస్వామికి కలగ జేసే వకాల్తానామా వ్రాసి, తిరునల్వేలికి చెందిన న్యాయవాది శ్రీ వెంకటరామయ్యర్ శ్రీభగవాన్ సమక్షంలో దానికి అధికారిక ముద్ర వేసారు. 'సర్వాధికారి శ్రీనిరంజనానందస్వామి, శ్రీరమణా శ్రమం' అనే ఒక రబ్బరు స్టాంపు తయారు చేయించి చిన్న స్వామికి ఇచ్చారు. శ్రీరమణాశ్రమం ఒక సంస్థగా మారటానికి ఇది అధికార చిహ్నం.

చిన్నస్వామి అత్యున్నత ప్రమాణాలు వున్న ఒక మార్గదర్శకమైన కార్యనిర్వహణాధికారిగా తయారు కావడానికి శ్రీభగవాన్ నిశ్శబ్దంగా శిక్షణ ఇచ్చారు. వారికి కావలసిన సమయంలో తగు చేయూతనిచ్చారు. ఒక సంస్థను ఎలా నడపాలో, ఇతరులతో ఎలా సహకరించాలో వారికి నేర్పి చూపారు. చిన్నస్వామి ఎపుడూ

ఆశ్రమ శ్రేయస్సుకోసం పాటుపడ్డారే కానీ, తన స్వలాభం ఎపుడూ చూసుకోలేదు.

1932లో శ్రీకావ్యకంఠ గణపతిముని ఆశ్రమ కార్యనిర్వహణాధికారిగా వుండాలని కాంక్షించారు. కావ్యకంఠులు గొప్ప సంస్కృత పండితులు, అమోఘ మేధాశాలి, విశేషమైన ప్రతిభ గల కవి, అత్యున్నతమైన విలువలు గల శీలవంతుడు. అన్నిటినీ మించి శ్రీభగవాన్‌కు మహాభక్తులు. తన శిష్యులను ఎందరినో శ్రీభగవాన్ వద్దకు తీసుకువచ్చారు. శ్రీగణపతి ముని, చెన్నై రామస్వామి అయ్యంగార్‌తో ఆశ్రమానికి వచ్చారు. ముఖ్యమైన నిర్ణయాలన్నీ శ్రీభగవాన్ సమక్షంలో తీసుకోబడేవి కాబట్టి, ఈ విషయం చర్చించడానికి ఒక సమావేశం ఏర్పరిచారు.

ఆ మాటల సందర్భంలో, శ్రీ భగవాన్ గణపతిమునివైపు తిరిగి, "పిచ్చైకు ఎప్పటినుండో ఆశ్రమ నిర్వహణ చేయాలనే కోరిక వున్నట్లుంది. అతనిని చేయనీయరాదా." అన్నారు. ఆ క్షణం నుండి, నాయన ఆయన అనుచరులు, తమ అభిప్రాయాన్ని పూర్తిగా విసర్జించి, సామాన్యమైన భక్తులుగా కొనసాగుతూ ఆశ్రమ యాజమాన్యానికి అన్ని విధాలా సహకరిస్తూ వచ్చారు.

చిన్నస్వామి ఆశ్రమాన్ని ఎంతో కట్టుబాటుతోనూ, నిబద్ధతతోనూ, నిర్వహించేవారు. ఆశ్రమానికి వచ్చిన భోజన సామగ్రికానీ, ధనరూపంగాగానీ, ఇతరత్రాగానీ వచ్చే కానుకలను ఎంతో జాగ్రత్తగా వినియోగించేవారు. శ్రీభగవాన్‌కు సేవ చేయడం, భక్తుల సౌకర్యం చూసుకోవడం, ఆశ్రమాన్ని చక్కగా నిర్వహించడం తప్పితే వారికి వేరే ఆలోచన వుండేది కాదు. చిన్నస్వామి అందరినీ సమభావంతో చూసేవారు. శ్రీరమణాశ్రమం ఒక సన్న్యాసాశ్రమం



కానప్పటికీ, నిజమైన సన్న్యాసాశ్రమ ఆదర్శంతో నడుపబడింది. అవసరమైనపుడు శ్రీభగవాన్ చిన్నస్వామిని మందలించేవారు. కానీ, ఆశ్రమ నిర్వహణలో ఆయనకు పూర్తి సహాయం అందించేవారు.

ఆశ్రమం పెరుగుతూ వచ్చింది. సర్వాధికారికి ఒక సహాయకారి, ఆయన తర్వాత ఆశ్రమ నిర్వహణ బాధ్యత చూసుకునేవారి అవసరం కనిపించింది. చెట్టినాడు నుండి చిన్నస్వామిగారి కుమారుడు వేంకటరామన్‌ను భార్య, ఇద్దరు కుమారులతో సహా పిలిపించి, సర్వాధికారికి సహాయకుడుగా వుండేటట్లు శిక్షణ ఇచ్చారు.

ఆశ్రమంలో కొంతమంది తృష్ణాపరులు, అత్యాశ కలిగినవారు వుండేవారు. సర్వాధికారి పదవి చిక్కించుకోవాలని వారి కాంక్ష. ఆశ్రమ ఆధ్యాత్మిక వాతావరణాన్ని, ఆశ్రమ నిర్వహణకూ ఇబ్బంది కలిగే చికాకులు కల్పించేవారు. ఆశ్రమాన్ని కోర్టులకు కూడా ఈడ్చారు. అందువల్ల, ఆశ్రమ యాజమాన్యం గురించి, శ్రీభగవాన్ ఒక వీలునామా వ్రాస్తే, ఈ సమస్య శాశ్వతంగా పరిష్కరింపబడుతుంది అని కొందరు ఆశ్రమ శ్రేయోభిలాషులు భావించారు. తదనుగుణంగా, మద్రాస్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తిగా పూర్వం పనిచేసిన శ్రీసుందరం చెట్టియార్ వీలునామా ముసాయిదా తయారు చేసారు. నెల్లూరు న్యాయవాది, శ్రీగిద్దలూరి సాంబశివరావుగారు, మరికొందరు భక్తులు దానిని 1938 మార్చి 6వ తారీఖున శ్రీభగవాన్ సమక్షంలో చదివి వినిపించారు. శ్రీభగవాన్ చేసిన కొన్ని సవరణలతో, వీలునామాకు తుదిరూపం ఇచ్చారు. తాను పెట్టాల్సిన సంతకం స్థాయిలో శ్రీభగవాన్ ఒక గీత గీశారు. వీలునామాను రిజిష్టర్ చేశారు. *(సశేషం)*

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# అణ్ణామలై స్వామి

*(ఏప్రిల్ సంచిక తరువాయి)* - మల్లాది ఫణిమాల

ఆశ్రమంలో అణ్ణామలైస్వామి కట్టని కట్టడములేదు. ముందుగా వరదలు, వర్షాలకు ఆశ్రమంలోకి నీరు రాకుండా పెద్ద గోడకట్టారు. తరువాత సామానులగది, అట్లాగే భగవాన్‌కు ప్రత్యేకంగా స్నానాలగది, జింకసమాధి, జాకి సమాధి, పాత భోజన శాల, వంటగది, వేదపాఠశాల, మేజర్ చాడ్విక్ గది, ఆశ్రమంలోని ట్యాంకునకు రాతిమెట్లు, చివరికు ఆసుపత్రి కూడా వారిచే నిర్మించబడినవి. ఈ కట్టడాలన్నీ నిర్మించే సమయాలలో ఆయన తీవ్రమైన ఎండను, ఎదుటి వారిచే అవమానాలను, మోసాలు, ఎగతాళిని తట్టుకుంటూ పూర్తి చేశారంటే దానికి భగవాన్ అనుగ్రహం కాక ఇంకేమిటి? గురువు అనుగ్రహం లేకుంటే, మానవ మాత్రులకు సాధ్యం కాదు. వారి ద్వారా నిర్మించబడవలసినవన్నీ 1938 నాటికి పూర్తికాగా, ఆ సమయానికి అణ్ణామలైస్వామి ఆరోగ్యం కూడా క్షీణింప సాగింది. అది చూచి యోగిరామయ్య, "భగవాన్, మీరు ఆయనను విశ్రాంతి తీసుకొమ్మని ఎందుకు చెప్పరు?" అని అడిగారు. భగవాన్ ఒకరోజు అణ్ణామలైస్వామితో "నీ కర్మలన్ని పూర్తి అయ్యాయి. ఇక నీవు స్వతంత్రుడవు. భగవాన్ అంతకు ముందుగాని, ఆ తరువాత గాని ఎవరినీ హత్తుకోలేదు. భగవాన్ వారికి ఇచ్చిన కఠోరశ్రమ, వారి యొక్క ప్రారబ్ధములను, ఆ యొక్క శరీరము, మనస్సులను అనుభవింప చేసి, వారి యొక్క ఆలింగనంతో పూర్తిగా పునీతులను చేశారు. అణ్ణామలైస్వామి కూడా ఏ క్షణంలోనూ, భగవాన్ బోధ అయిన "తాను శరీరం



కాదు, మనసూ కాదు, ఆత్మస్వరూపం, నిత్యచైతన్యమే తాను" అన్న ఎరుకను ఎన్నడూ వీడలేదు. అణ్ణామలైస్వామి నడిచి వస్తుంటే, భగవాన్ ఆ కట్టడాలే కదిలి వస్తున్నట్లుంది" అని చమత్కరించేవారు.

అదీగాక భగవాన్ స్నాన సమయంలో తనను కౌగిలించుకుని ఆనందా ఆనందా అంటూ అట్లానే పొదివిపట్టుకున్నారని, ఆ సమయంలో తాము ఎరుకతో ఉన్నప్పటికీ బాహ్య స్పృహ లేదనీ భగవాన్ కాని, మాధవస్వామి కాని తనను ఒంటరిగా వదిలి వెళ్ళి పోవడం తెలియదనీ, ఆయన గనేశన్ గారికి వివరించారు. అది మొదలు వారు ధ్యానంలో గడపదలచి భగవాన్ యొక్క అనుమతి తో పల్లాకొత్తులో వున్నారు. అణ్ణామలైస్వామి తాను ఉండదలచిన కుటీరం వివరాలన్ని భగవాన్‌కు చెప్పేవారు. భగవాన్ కూడా వారికి ఆధ్యాత్మికముగా పురోగతి చెందడానికి మార్గదర్శనము చేసెడి వారు. భగవాన్ వారిని ఆశ్రమానికి కూడా రావలసిన పని లేదనీ, "నీవు నీ కుటీరం వదిలి ఎక్కడికీ వెళ్ళవద్దు, కొండపైన మాత్రము నీ ఇష్టము" అని చెప్పారు. అలాగే ఒకసారి అణ్ణామలై స్వామికి ఒకరోజు భోజనం లేకపోవడంతో భగవాన్ అడవిలోకి వెళ్ళి ఒక ప్రత్యేకమైన ఆకులను తెచ్చుకుని గుజ్జులా కూరచేసుకుని అన్నంతో తినమని చెప్పారు. భగవాన్ ఈ విధంగా ఇతరులకు ఎవరికీ చెప్పలేదు. అలాగ అణ్ణామలైస్వామి కొండచిలువవలె కదలకుండా ఉండి తన వద్దకు తేబడిన ఆహారాన్నే స్వీకరించే వారు. భగవాన్ ఆయనను భిక్షకు కూడా కదలనివ్వకుండా అన్నీ సమకూరేటట్లు అనుగ్రహించేవారు.

భగవానుల అనుగ్రహంతో ఆత్మస్థితులైన అణ్ణామలైస్వామి "ఆత్మాన్వేషణ" గురించి బోధించేవారు. వారి బోధలు పండితు

లకు, పామరులకు కూడా అర్థమయేటట్లు ఉండేవి. సామాన్యులకు తెలిసేలాగ చెప్పేవారు. “ఆత్మాన్వేషణ చేయడమంటే నిన్ను నువ్వు మరల తెలుసుకొనడమే ఎందుకంటే నీ నిజస్వరూపాన్ని నీవు మర్చిపోయావు కనుక. ఇంకా నీవు చీకటి నుంచి బయటపడేందుకు నీకు వెలుగు కావాలి. నిరంతరం వెలుగుంటే, పక్కదారినించి చీకటిలోపలికి రాలేదు” అని అరటి పండు ఒలిచినట్లు చెప్పేవారు. ఎవరైనా ఆత్మాన్వేషణకు ముందు భక్తి, కర్మ యోగాలను అభ్యసించవలెనా, అని అంటే కూడా, నీకు ఆత్మాన్వేషణే కావాలి అదే అభ్యాసము చేయి. కాని వేరే వేరేవి ఎందుకు అనెడివారు. ఇప్పటికీ అణ్ణామలైస్వామి బోధలను అనుసరిస్తూ ఎంతోమంది ఆత్మాన్వేషణను అభ్యాసం చేస్తున్నారు. అణ్ణామలైస్వామికి కూడా ఎందరో శిష్యులున్నారు. వారి బోధలు “అంతిమ సంభాషణలు” అనే పుస్తకమందు సాధకులకు చాలా చక్కగా వివరించబడ్డాయి.

అణ్ణామలైస్వామి వారి ఆశ్రమములో నుండగా శ్రీ గణేశన్, కుంజుస్వామి మొదలైన వారితో ఆశ్రమానికి వెళ్ళితే వారికి అల్లం టీ చేసి ఇచ్చెడివారు. వారికి గణేశన్ అంటే ఎంతో ఇష్టం. ఎప్పుడూ వారి తల నిమిరేవారు. ఎందుకంటే గణేశన్ చిన్నతనంలో భగవాన్ కూర్చునే సోఫా ఎక్కేసేవారు. ఆశ్రమం వారు వారిని దింపేసేవారు. ఒకసారి ఎవరూ లేనపుడు గణేశన్ సోఫా ఎక్కితే భగవాన్ వారి కుడి పాదాన్ని గణేశన్ తలపై పెట్టి, ఎడమ పాదముతో వారిని సోఫాలోకి తోశారట. అందుకే తమ గురువు గారి పాదము తాకిన గణేశన్ తల అంటే అణ్ణామలైస్వామికి ఎంతో అభిమానం. ఒకసారి అట్లే తలనిమిరి, ముద్దిడినారు. అలాగ చేసినది ఒక గణేశన్‌ను మాత్రమే. అట్లాగే రమణులు అణ్ణామలైస్వామికి ఆకులను ఇచ్చి



తినమన్నట్లుగానే, వీరును గణేశన్ ఆశ్రమ కార్యములనుండి విరమించుకున్న పిదప, గణేశన్‌కు కొన్ని మొక్కలను ఇచ్చి (ఇరువచ్చి) వాటిని ప్రసాదంగా స్వీకరించమని చెప్పారు. ఆ మొక్కలు ఇప్పటికీ ‘ఆనంద రమణ’ యందు దర్శకులు చూడవచ్చు.

పల్లాకొత్తులో అణ్ణామలైస్వామి దేహం విడువగా సమాధి అక్కడే నిర్మించారు. కాలాంతరమున రమణాశ్రమము వారు దానిని రమణాశ్రమమునందు కలిపివేశారు. ఆ విధంగా రమణులు, తమ ప్రియ శిష్యుణ్ణి తమ వద్దకే రప్పించుకున్నారు.

“లోనికివెళ్ళి, ఎల్లప్పుడూ హృదయాన్ని అంటిపెట్టుకో, శరీరం, మనసులతో తాదాత్మ్యం చెందకు! అవి దుఃఖ హేతువులు” అనునది భగవానుల మొదటి ఉపదేశము.

అణ్ణామలైస్వామి! “నీవు ఈ దేహానివేకాదు, మనసువూ కాదు, నువ్వు శుద్ధచైతన్యానివి. నీవు సర్వవ్యాపియైన ఆత్మస్వరూపుడవు” అన్నది రెండవ ఉపదేశము. వీటిని గట్టిగా పట్టుకొనుట వల్లనే, అణ్ణామలైస్వామి ఎవ్వరూ చేయలేనటువంటి కష్టమైన పనులను, భగవానుల వంటి సద్గురువుల కృపతో అవలీలగా పూర్తిచేసి, తన ప్రారబ్ధమును కడుక్కున్నారు. వారు గురువుగారికి ఎలా విధేయుడుగా వున్నారో సాధకులు గ్రహించాలి. మరియొకటి ఏమనగా “హృదయం కరగాలి”, మనం జ్ఞానంలోకి వికసించాలంటే మన హృదయం కరగటమనేది చాలా ముఖ్యం. “నాకు” అనుదానిని పూర్తిగా శరణాగతి చెందించాలి. “నాకు అది కావాలి” అన్నది పూర్తిగా గురువుకు సమర్పణ చేసి, శ్రీ అణ్ణామలైస్వామి సద్గురువు భగవానుల బాటలో పయనించి, ఆత్మ నిష్ఠతో తానూ ఒక గురువు కాగలిగినట్లుగా వారి బోధలతో సాధకులు కూడా ముక్తి పొందవచ్చు. *(మూలం: రమణ పెరియ పురాణం)*

# భగవాను, ప్రాణాయామము

(మౌంటెన్‌పాత్, జనవరి-మార్చి, 2013 (సంపుటి 50, సంచిక 1)లో యోగిని జె. పునీతవతిగారు 'భగవాన్ అండ్ ప్రాణాయామ' అన్న శీర్షికతో రచించిన వ్యాసంలోని ఎన్నుకొనబడిన భాగాల స్వేచ్ఛానువాదం)

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## యోగాభ్యాసన ముఖ్యోద్దేశం

"తుదకు, శరీరము, ప్రపంచమూ, రెండూ లేవు" అని భగవాన్ శ్రీరమణ మహర్షి అంటారు. ఈ గొప్ప సత్యాన్ని తెలుసుకునేందుకు మనం యోగాభ్యాసన చేస్తాం. భౌతికస్థాయిలో శరీరాన్ని యథోచితమైన తీరులో, హాయిగా వుండడానికి హఠ్‌యోగాన్ని అభ్యసిస్తాం. మనం అక్కడితో ఆపరాదు, ముందుకు వెళ్ళాలి. 'యోగ' అన్న పదం యొక్క అర్థం దేవునితో ఏకమవడమని. యోగశాస్త్రం యొక్క ఆదిగురువు పతంజలిముని ప్రకారం యోగ'నిచ్చెన'లో ఎనిమిది మెట్లు వుంటాయి. అందులో మొదట నాలుగు, 'యమ', 'నియమ', 'ఆసన', 'ప్రాణాయామా'లు. యోగాభ్యాసం చేసే వ్యక్తి క్రమంగా పై మెట్లను ('ప్రత్యాహార, 'ధారణ', 'ధ్యాన' అంతస్తులను) అధిరోహించి 'సమాధి' స్థాయిని చేరుకుంటాడు. యమ, నియమ స్థాయిలు భౌతిక, ఆధ్యాత్మిక క్రమశిక్షణ సూత్రాలకు సంబంధించినవి. ఆసన, ప్రాణాయామాలు ముఖ్యమైనవి. కాని, అంతటితో ఈ ప్రక్రియ ముగిసిపోయినట్లు భావించరాదు. సక్రమంగా వీటిని పాటించినప్పుడు అవి అంతకంటే ఉన్నతమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందడానికి దారితీస్తాయి.



స్మశానవాటికలో శవం చుట్టూ పేర్చి వుంచిన కట్టెలను మండించడానికి ఒక మండుతున్న కట్టెను వాడుతారు. పని ముగిసిన తరువాత దానిని కూడా మంటలో పడేస్తారు. అలాగే ఒకసారి ఉన్నతస్థాయికి చేరిన తరువాత నిచ్చెన యొక్క అవసరం ఇక వుండదు. జ్ఞానాన్ని సాధించడానికి, భక్తి పట్ల మనకు తగిన అనురక్తి వుంటే, దేవుడిని స్పష్టంగా అవగాహన చేసుకుని సాక్షాత్తుగా అనుభవించడానికి, మనసు కూడ నిచ్చెన లాగ మనకు సహాయపడుతుంది. ఆ స్థితి చేరేసరికి, మనసూ మాయమౌతుంది. అలాంటి సాధనకు వాహికగా ఉపయోగపడే శరీరాన్ని ఆరోగ్యంగా వుంచడానికి సహాయపడేవి ఆసనాలు, ప్రాణాయామం. ఈ రోజుల్లో యోగాసనాలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు గుర్తించడంతో, వాటిపట్ల జనప్రీతి పెరిగింది. కాని, అదే ఆఖరు మెట్టు అన్న తప్పుడు అభిప్రాయం కూడ ఎక్కువైంది. దేవుడిని దృష్టిలో పెట్టుకు ఆలోచిస్తే, యోగాసనాలు అంతం కావని, కేవలం ఒక మార్గమేనని మరచిపోరాదు. ఆసనాలు, ప్రాణాయామాన్ని శరీర రక్షణ కోసం మాత్రం ఉద్దేశించబడినవి అని భావిస్తే, అది కొబ్బరికాయ పై పెంకను మాత్రమే, శుభ్రంగా, నున్నగా పాలిష్ చేసి అందులోని తేటనీరు (ధ్యానం) లేతకొబ్బరి (దేవుడు)ని పట్టించుకొనకపోవడం వంటిది. ఆసనాల నిజమైన ప్రయోజనం ధ్యానాభ్యాసానికి శరీరాన్ని అనువుగా మలచడానికి మాత్రమే.

## భగవాన్ రమణుల బ్రహ్మాస్త్రం

భగవాన్ విచారమార్గాన్ని తప్ప మరిదేనిని సూచించలేదు. 'నేను ఎవరు?' అదే ఆయన చెప్పిన తారకమంత్రం, బ్రహ్మాస్త్రం.

ఎవరో గ్రుచ్చి, గ్రుచ్చి అడిగినప్పుడు ప్రాణాయామం కొంత మేరకు మనసును అదుపు చేయడానికి సహాయపడుతుందని అన్నారు. కాని ధ్యానానికి ఎన్నో పద్ధతులు, క్రమశిక్షణలు వున్నప్పటికి, మనసును స్థిరంగా వుంచడానికి శాశ్వతమైన మార్గం విచారణయే అని నొక్కి చెప్పారు. ధ్యానం తాత్కాలికంగా మనసును అదుపులో పెట్టగలదు. ధ్యానం నుండి బైటకు వచ్చినప్పుడు (అది తీవ్రమైన ధ్యానమైనా సరే), ఆలోచనలు తోసుకు వస్తాయి. ఆనకట్టలో నిలువవున్న నీటిని తలుపు నిలిపి వుంచుతుంది. దానికి ఒక చిన్న సందు వున్నప్పటికీ, నీరు అటునుండి తోసుకుని బయట పడతాయి. సాధారణమైన తేలికపాటి ధ్యానం, తోట నుండి కలుపు మొక్కలను తోటమాలి ఒకటొకటి ఏరివేస్తున్న దానితో సమానం. ఓపికగా ఒకదాని తరువాత ఒక ఆలోచనను సమూలంగా తీసి వేస్తాం. విచారమార్గంలో, మనం హృదయాన్ని చేరి, అన్ని ఆలోచనలకు మూలమైన 'నేను' ఆలోచనను త్రవ్వి తీసేస్తాం.

ఆలోచనలను పరికించి చూస్తూ, అవి ఎవరికి వస్తున్నాయని, లేదా, 'నేను ఎవరు?' అని మనల్ని ప్రశ్నించుకోమని భగవాన్ అంటారు. సముద్రపు నీటిపై తేలుతున్నట్లు భావించుకుంటూ, లోతుగా, బాగా లోతుగా దాదాపు సముద్రపు అడుగు భాగాన్ని తగులుతున్నట్లు వెళుతూ, శ్వాసను బిగించి (అపురూపమైన ముత్యాలను వెదకుతున్నట్లు) ఆలోచనలు ఎక్కడినుండి మొదలవుతున్నాయో గమనించాలి. ఇక సముద్రపు పై అంచు ల్లోని తడి ఇసుకలోనుండి చిన్నచిన్న పీతపిల్లలు వున్నట్లుండి బైటకు వస్తాయి. అలాగే ఆలోచనలు ఎక్కడినుండియో వచ్చి



అగపడతాయి. పీతలలాగ అన్ని దిక్కులకు పోతున్న వాటిని పట్టుకోవడం కష్టం. అందుకే మనల్ని లోబరచుకొనగలిగే ఒక బలమైన ఆలోచన కలిగినప్పుడు మనం స్థిరంగా, చురుకుగా వుండి, దానిని పట్టి నిర్వీర్యం చేయగల శక్తిని పెంపొందించు కోవాలి. ఈ ఆలోచనలే మన చింతలకు, ఆదుర్దాలకు, మూల కారణం. ఆలోచనలను సృష్టించే అజ్ఞాన భూతాన్ని నటరాజస్వామి లాగ ఉక్కుపాదంతో తొక్కివేయాలి.

## శ్వాసపై ధ్యాస

ప్రాణాయామమంటే, శ్వాసను అదుపులో వుంచడం. మనం రోజంతట గాలిని లోనికి, బయటికి పోనిస్తూ, శ్వాసక్రియను జరుపుతుంటాం. శ్వాసను అదుపులో పెడితే ఆలోచనలు కూడ అదుపులోనికి వస్తాయి. మనం వెంటనే ఆత్మవిచారణను అభ్యాసం చేయలేకపోతే, హఠయోగాన్ని సహాయంగా తీసుకోవచ్చు. మనకు అనుకూలమైన భంగిమలో కూర్చొని, వీలైతే నాలుకను దగ్గరగా కంఠ ద్వారాన్ని కప్పేలాగ మడచిపెట్టి శ్వాసను బంధించాలి. అదే సమయంలో మలద్వారాన్ని కుంచింపజేసి, బిగించి, లోపలికి లాగుకోవాలి. ఈ వ్యాయామాన్ని రోజులో ఎంత వీలైతే అంతగా చేయాలి. అలా చేయడంతో, ప్రశాంతత పొంది, శరీరానికి మేలు జరుగుతుంది.

'టాక్స్‌విత్ శ్రీరమణమహర్షి' అన్న గ్రంథంలో సూచించిన మరొక ప్రక్రియ ప్రకారం, శ్వాసను బయటికి వదలిపెట్టి, ఎనిమిది (సంఖ్యలు) లెక్కపెట్టి, 'నేను శరీరాన్ని కాను' అని ఆలోచించడం. ఆ తరువాత ముక్కు ద్వారా గాలిని పీలుస్తూ, 'నేను ఎవరు?'

అని ప్రశ్నించుకొనడం. శ్వాసను బంధించినప్పుడు పదహారు లెక్కపెట్టి, 'నేను అది' అని ఆలోచించడం. కాని ఈ ప్రక్రియలు ఆలోచనలు ఉధృతంగా వచ్చినప్పుడు ప్రాథమిక సాధనంగా మాత్రమే పనికివస్తాయని గుర్తుంచుకోవాలి. తరువాతి దశలో, అప్రయత్నంగా ఆత్మవిచారణ చేయగలిగినప్పుడు, వీటిని వదలి పెట్టాలి.

"నేను ఎవరు?" అన్న విచారణకు శ్వాసపై ధ్యాస వుంచడం అవసరమా అని భగవానును ఎవరో అడిగారు. జవాబుగా, "అదంతా వ్యక్తియొక్క పక్వత (అనుభవం, దార్ఢ్యత) మీద ఆధార పడి వుంటుంది. మానసిక బలం (పలు పర్యాయాలు అభ్యాసం ద్వారా సిద్ధపడిన మనసు) వుండాలి. అలాగ ధ్యాసను కేంద్రీకరించి మనసును అదుపు చేయగలిగి శక్తిని అన్వేషణ దిశలో మరలించ గలిగిన వ్యక్తులకు, శ్వాసను గమనించి దానిపై ధ్యాసవుంచమని సలహా ఇవ్వవచ్చు. అలా దృష్టిని నిలుపగలిగితే స్వభావసిద్ధంగానే ఆలోచన ఆగిపోయి మనసు అదుపులోనికి వస్తుంది. శ్వాస, మనసు ఒకచోటినుండియే ఉదయిస్తాయి. వాటిలో ఒక దానిని అదుపులో పెడితే, రెండవది కూడా అణుగుతుంది," అని మహర్షి అన్నారు. మనలోపల "నేను" యొక్క మూలాన్ని గమనించమని భగవాన్ చెప్పడంలో "నేను ఎక్కడివాడిని" ఆలోచించమని వారి ఉద్దేశం. అంతేగాని, ఊరకే 'నేను ఎవరు?', 'నేను శరీరం కాదు' "ఇంద్రియాలు కాదు" అంటూ అలాంటి ఆలోచనలను తోసివేసి, మిగిలినవి యథార్థమైన సత్యం అనుకోవడం కాదు. 'నేను' అనే ఆలోచన, మన 'అహం' ఎక్కడ ఉదయిస్తోంది అన్నది తెలుసు



కోవడం దాని భావం. ప్రత్యేకించి చెప్పకపోయినప్పటికి, ఈ పద్ధతిలో శ్వాసమీద ధ్యాస వుంచాలన్నది కూడ చేరివుంది. అన్ని ఆలోచనలకు మూలమైన 'నేను' ఆలోచన ఎక్కడిది అన్న అన్వేషణలో శ్వాసమూలస్థానం ఏది అని కూడా అన్వేషిస్తాం. ఎందుకంటే, ఈ 'నేను' ఆలోచన, శ్వాస కూడ ఒకే స్థానం నుండి బయలుదేరుతాయి.

చదరంగం ఆటలో మొదటినుండి వేసే ప్రతి ఎత్తులో కూడ 'రాజు'ను రక్షిస్తూ వుండాలి. అలాగే, 'నేను' అన్న విషయంలోను, ప్రతి అడుగు శ్రద్ధతో, జాగ్రత్తగా వేయాలి. అంటే, లౌకిక జీవితంలో లాగ, ఆధ్యాత్మిక జీవితంలో కూడ శ్రద్ధ అవసరం. మెలకువగా వున్నప్పుడు నెమ్మదిగా నడుస్తున్నవారు కూడ, పరిస్థితిని బట్టి, జాగరూకతతో, అవసరమైతే ప్రాణరక్షణకు తటాలున దూకవలసి వుంటుంది.

## యాంత్రికమైన శ్వాస నియంత్రణ పనికిరాదు

తాయమానవర్ అన్న ఒక తమిళ యోగి, కవి, 'మనం సముద్రాన్ని కొలవవచ్చు, ఇసుకతో తాడును పేనవచ్చు, పిచ్చి ఏనుగును శాంతింపజేయవచ్చు, కాని మనసును అదుపు చేయ లేము అని అన్నారు. భగవాన్ మాత్రం (ఆ రోజుల్లో కంటే) తాము ప్రతిపాదించిన 'బ్రహ్మాస్త్రం ఫలితాన్ని ఇస్తుందని అనేవారు. అలాంటి మహాపురుషులకు సులభసాధ్యమే అయినప్పటికి, మనలాంటి అజ్ఞానులకు కష్టతరమే. కాని, గురువు పలుకులపై నమ్మకముంచి ప్రయత్నించడం తప్ప మనకు వేరే మార్గం లేదు. ఈ ప్రక్రియను ఎలా జరపాలో అర్థం కావడం లేదని ఒక భక్తుడు

సందేహాన్ని వెలిబుచ్చినప్పుడు మహర్షి, "నీవు శ్వాస నియంత్రణ చేస్తున్నావు. యాంత్రికంగా శ్వాసను అదుపుచేయడం లక్ష్యాన్ని చేర్చదు. అది కొద్దిగా మాత్రమే సహాయపడగలదు. అదే సమయంలో మనసును చురుకుగా వుంచి, 'నేను' ఆలోచనను గుర్తుకు తెచ్చుకుంటూ, దాని మూలాన్ని వెదుకు. అప్పుడు శ్వాస ఎక్కడ అణుగుతుందో, ఈ 'నేను' ఆలోచన ఉదయిస్తుంది. అది అణగడం, మళ్ళీ మొదలుకావడం, ఒకే సమయంలో జరుగుతుంది. శ్వాసతోబాటే ఈ ఆలోచన కూడ ముగియాలి. అప్పుడు మరొక ప్రకాశవంతము, అనంతమూ అయిన 'నేను-నేను' రంగంలోనికి దిగి నిరంతరంగా, అవిచ్ఛిన్నంగా సాగుతుంది. అదే మన లక్ష్యం. దానిని దేవుడు, ఆత్మ, కుండలినీ శక్తి, చైతన్యం, యోగం, భక్తి, జ్ఞానం అని పలునామాలతో పిలుస్తాం.

ఒక వ్యక్తి డాక్టర్ అయిన తరువాత, అతను ఇంట్లో వున్నా, వైద్యశాలలో వున్నా డాక్టరే. అలాగే, యోగాభ్యాసం చేసే వ్యక్తి యోగి గానే వుండిపోతాడు. మనకు ఏదైన డిగ్రీ, డిప్లొమాలాంటివి సంపాదించాలంటే కొన్నేళ్ళు చదవాల్సి వుంటుంది. కాని ఆధ్యాత్మిక విషయాలలో అలా కాదు. జీవితాంతం అభ్యాసం చేయాల్సిందే. యోగి అయినంత మాత్రాన జ్ఞానికాడు. జ్ఞాని కావడానికి అభ్యాసం చేస్తూనే వుండాలి.

ధ్యానాన్ని ఒకరు నేర్పడం, ఒకరు నేర్చుకొనడం అంటూ వుండదు. కావలసినది ఆ క్షణంలోనే స్థిరంగా వుండి, నిశ్శబ్దాన్ని అర్థం చేసుకొనడమే. ఎందుకంటే మనం గతం లేదా భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ వుంటే ప్రస్తుతాన్ని పోగొట్టుకుంటాం. ఎప్పటికీ, ప్రస్తుతం, ఈ క్షణంలో వుండాలి. కొన్ని క్షణాలు, లేదా కొన్ని



గంటలు అలా కూర్చొని ధ్యానం చేయవచ్చు. కాని అందులో ఎప్పటికీ మునిగిపోయి వుండాలి. కళ్ళు తెరచివుంచి అభ్యాసం చేయాలి. కళ్ళు మూసుకుని ధ్యానం చేయడానికి ప్రయత్నిస్తే, కళ్ళు తెరచిన తరువాత తిరిగి ఆలోచనలు రావడం మొదలవుతుంది. భగవాన్ దానిని 'సహజ సమాధి' అంటారు. మనం ఒక పుస్తకాన్ని చదువుతున్నప్పుడు, లేదా ఒక సినిమా చూస్తున్నప్పుడు పరిసరాలు మన ఏకాగ్రతను భంగపరచలేవు, ఎందుకంటే మనం ఒక పనిలో పూర్తిగా మునిగి వున్నాం కాబట్టి. కాని ఒక పూజ, లేదా ధ్యానంలో ఏకాగ్రత లేనప్పుడు వాటిలో పూర్తిగా నిమగ్నులం సులభంగా కాలేము. భగవాన్ చెప్పినట్లు, మనం ఈ శరీరం కాదు గనుక బాహ్యం నుండి ఈ శరీరాన్ని పరికించి శరీరం ఏమి చేస్తున్నదని అర్థం చేసుకోవాలి.

మన శరీరాన్ని అలంకరించుకొనడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తుంటాం. మన శరీరంలోని ఒక యంత్రం రోజుకు ఇరవైనాలుగు గంటలూ పనిచేస్తూనే వుంటుంది. దాన్ని పట్టించుకుంటామా? శ్రద్ధతో పరికిస్తే అది ఆగిపోతుంది. ఎవరైనా గమనిస్తున్నట్లు తెలిస్తే దొంగ పరుగెత్తిపోతాడు. పిల్లి తన పిల్లల్ని కాపాడడానికి వాటి చుట్టూ తిరుగుతూ వున్నట్లు, మనం మన ఆలోచనలపై నిరంతరం దృష్టి పెట్టి వుండాలి. మనలోని నిజమైన 'నేను'ను ఎల్లప్పుడూ గమనిస్తూనే వుండాలి. గందరగోళమంతా పోయి మనసు ప్రశాంతమౌతుంది. ఈ రాజమార్గాన్ని వదలకుండ అనుసరిస్తూ, ఆలోచనలు, భ్రాంతి, భ్రమలతో కూడిన అరణ్యంలో తప్పిపోకుండ జాగ్రత్తపడదాం.

## Moving Tales from Mahabharatha

Dr.K.Subrahmanian (Talk No.22)

We should keep on reading great devotional books like the Ramayana and the Mahabharata. We should not say, " I have already read these books. I don't need to read them again." Just as eating nourishes the body and keeps it strong, reading great books, meditating and praying strengthens the spirit.When you read the Ramayana or the Mahabharata, what impresses you are the lives of great people like Rama, Hanuman, Krishna, Vidura and so on. We wonder whether it is possible to live such lives. We can learn what values are important for our lives by reading such great works again and again.

Krishna is considered as a *purna* (complete) avatar of Vishnu. Moreover, those who came in contact with Krishna knew that he was not an ordinary being. Everything about Krishna was *madhuram,* beautiful. But even then, human nature is such that Krishna was ridiculed and abused by several people. Sishupala insulted him repeatedly. Krishna put up with all the insults and humiliations. As we all know, when Krishna found that Duryodhana was determined to fight the Pandavas, he decided to go as a messenger of peace. He said,"War should be avoided.I will go to Duryodhana and try to convince him that war should be avoided'. Krishna, the Lord of the universe humbled himself to go as an ordinary messenger. Why did he do it? He did it in order to set an example for all of us.



Duryodhana wanted to give Krishna a grand reception. But he was not willing to give up the idea of war. He mainly wanted to impress Krishna with a big show. He also wanted to prove to Krishna that he was superior to Krishna and better than the Pandavas in wealth.When Krishna came, he invited him to stay in his palace. But Krishna refused all the grand palaces offered for his stay and chose the humble abode of Vidura, much to the shock of Duryodhana. Vidura was staying in a small hut. When Vidura saw Krishna coming to his hut and choosing to stay there, he was moved to tears.He asked, "Why have you come here leaving all the comforts? I have nothing to offer you and you have come here!" Krishna said, "I have come to you Vidura, because even though you have nothing to offer by way of comforts, you have given your heart to me. That is all I need." From this incident we see that Lord Krishna is not interested in what we give; he comes to those who give themselves to him.

